క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మొయినాబాద్: జూన్ 28 వరకు కొత్తగా పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు రైతుబీమాకు ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాగమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు రైతు బీమా చేసుకున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ నామిని, ఆధార్‌లో మార్పులు ఏమైనా ఉంటే అలాంటి రైతులు జూలై 30లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు(14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు) రైతుబీమాకు అర్హులన్నారు. దరఖాస్తు ఫారానికి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీల జతచేసి ఆగస్టు 5లోపు మండల వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)కి దరఖాస్తు అందజేయాలన్నారు.

షాబాద్ పీహెచ్‌సీ వైద్యురాలిగా విజయలక్ష్మి



బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

షాబాద్: షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా విజయలక్ష్మి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ శ్రీనివాస్ నీలోఫర్ ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు. షాద్‌నగర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి షాబాద్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలు మెరుగైన వైద్యం అందించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



టోర్నీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆయా పాఠశాలల విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ శివకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21న 1వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు ఆయా విభాగాల్లో చక్కగా రాణించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం టోర్నీలో రాణించిన విద్యార్థులను తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అభినందించినట్లు తెలిపారు.

వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలి

చేవెళ్ల: విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పలు వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చేవెళ్లలో ఎస్సీ కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తున్న అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్ పొందుతారని డాక్టర్ సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు దాత డాక్టర్ సురేశ్, నిర్మల దంపతుల సహకారంతో క్లాస్‌మెట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నగదు, ప్రశంసాపత్రం, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివకుమారి, క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, మఠం రుషి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

అఖిలపక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అందరి సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణ చౌరస్తా విస్తరణపై సోమవారం ఎమ్మెల్యే అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింలు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, భీష్వ కిష్టయ్యలతో పాటుగా, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ, తదితర పార్టీల నేతలు, అర్‌అండ్‌బీ, ట్రాఫిక్, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తోందని, జనాభాకు అనుగుణంగా సదుపాయాలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని పట్టణ చౌరస్తాను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద ఫీట్ల సర్కిల్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. అందరి సూచనలు, సలహాలతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చౌరస్తా విస్తరణ కోసం అందరి అభిప్రాయాలను సేకరించేందుకు మరిన్ని సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కొందూటి నరేందర్, విశ్వం, రాజు, బాబర్‌ఖాన్, రఘు, దొడ్డి శ్రీనివాస్, చెంది తిరుపతి రెడ్డి, కానుగు అంతయ్య, సర్వర్‌పాషా, నందీశ్వర్, చింటు, రాయికల్ శ్రీను, సీఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ డీఈ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఎంపీడీఓ బన్సీలాల్



మాట్లాడుతున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వారిని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బన్సీలాల్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. చెత్తా చెదారాన్ని తొలగించాలని, డ్రైనేజీలు, మురుగు కాల్వలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలన్నారు. గుంతల్లో నీరు నిల్వడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వాటర్ పైపుల లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ.. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ కనబరచాలని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీఓ జయంత్‌రెడ్డి, డాక్టర్ రాఘవేందర్, శ్రావణ్‌కుమార్, శ్రీరామ, చంద్రకళ, పుష్పలీల, రెడ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. తంబు విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలపై పోరాటంలో భాగంగా ఈ నెల 26న చేపట్టే చలో అసెంబ్లీ కార్యక్రమానికి కార్మికులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బాకారం గ్రామస్తులు, బీజేపీ నాయకులు కలిసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని నగరంలో కలిసి అర్ధంతరంగా నిలిచిపోయిన ఎన్కెపల్లి–బాకారం రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయని అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నిలిచిన పనులను వెంటనే అధికారులతో మాట్లాడి ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బాకారం ఇమ్మిడి వినయ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, గ్రామ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు వడ్డె మహేశ్, నాయకులు రమేశ్‌ముదిరాజ్, అశోక్ పాల్గొన్నారు.

నియామకం

మొయినాబాద్‌రూరల్: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు నియామకమయ్యారు. ఈ ఎన్నిక ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సోమవారం హిమాయత్‌నగర్‌లో గల పార్టీ కార్యాలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నర్సింగ్‌రావుకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎస్సీ మోర్చా అభివృద్ధికి కష్టపడి పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం నర్సింగ్‌రావు తన ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బండి జ్ఞానేశ్వర్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు మోర నర్సింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు సన్మానం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, తదితరులు

షాబాద్: షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న సూపరింటెండెంట్ విజయలక్ష్మికి ఎంపీడీఓ అపర్ణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఆమె బదిలీపై హయత్‌నగర్ మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడ పని చేసిన పట్టుదలతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సూనియర్ అసిస్టెంట్ మల్లేశం, ఏపీఓ వీరాసింగ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

కొందుర్గు: పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మా గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 330 మంది విద్యార్థులున్నారని, ఇదివరకు 16 మంది ఉపాధ్యాయులు పనిచేసేవారని తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఉపాధ్యాయులందరూ బదిలీపై వెళ్లారని, ప్రస్తుతం కేవలం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని వివరించారు. ఇలాగైతే విద్యాబోధన ఎలా సాగుతుందన్నారు. తమ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం



అంతప్పగూడలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రజలు గ్రామాలకు వచ్చే ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండలంలోని తంగపల్లి గ్రామం నుంచి శంకర్‌పల్లికి వయా మడికట్టు, సంకేపల్లిగూడ, అంతప్పగూడ, పర్వేద, గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలను పామెన భీంభరత్, రాష్ట్ర పోల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల మీదుగా ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీస్ మూడు సంవత్సరాల క్రితం ఆగిపోయిందన్నారు. స్థానిక నాయకుల సహకారంతో ఈ బస్సు సర్వీస్‌ను తిరిగి ప్రారంభించామన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల, గ్రామాల నాయకులు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, శేరి అనంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్‌గౌడ్, చంద్రమౌళి, శ్రీనివాస్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్, సంజీవరెడ్డి, శ్రీధర్, నసీరుద్దీన్, సుభాన్‌రెడ్డి, పెంటయ్య, ప్రశాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవిచంద్రకుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. గ్రామాల్లో పాడుబడిన ఇళ్లను గుర్తించి అందులో నివాసం ఉంటున్న వారిని వేరే చోటకు తరలించాలన్నారు. మండలంలోని నిర్దవెళ్లి, మంగళిగూడ, తొమ్మిదిరేకుల గ్రామాల్లో ఇప్పటికే 8 ఇళ్లను గుర్తించామని వారిని ఆయా గ్రామాల్లో గల కమ్యూనిటీ భవనాల్లోకి తరలించాలని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఉన్న లక్ష్యం మేరకు మొక్కలను నాటేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. గ్రామ శివారుల్లో ఉన్న వాగులను గుర్తించి అక్కడ బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో దోమలు విజృంభించకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న 5 మంది ఉపాధ్యాయులను సోమవారం ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాల నుంచి ఉపాధ్యాయులు రామకృష్ణరావు, రాములు, వెంకటేశం, సుజాత, అరుంధతి అనే మందితో పాటు ఇక్కడే పదవీ విరమణ పొందిన యాదమ్మ అనే ఉపాధ్యాయురాలిని శాలువా, పూల దండలతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎక్కడున్న విద్యార్థులను వృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. బదిలీ అవుతున్న ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రఘునందన్‌రెడ్డి, అంజిరెడ్డి, జగదాంబ, సంధ్యశ్రీ, కుసుమ కుమారి, శ్రీనివాస్, జంగయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.



కొత్తూరు: బోనాల ఊరేగింపులో ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా బోనాల ఉత్సవాలు



షాబాద్: బోనాల ఊరేగింపు

కొత్తూరు: పండగలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన మైసమ్మ బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన పలువురు నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు పండగల ప్రాముఖ్యతలు తెలియాలంటే ప్రతి ఒక్కరూ పండగలను నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు ఊరేగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్‌గుప్తా, సురేశ్, దర్శన్, ఆంజనేయులు, రాజు, జయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చందనవెళ్లిలో..

షాబాద్: మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో బోనాలు ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉప్పలమ్మ, గడి మైసమ్మ ఆలయాల వద్ద ఉదయం నుంచే భక్తులు బారులు తీరి గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని అమ్మవార్లను వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

హామీలు అమలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతి



షాద్‌నగర్: ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



షాబాద్‌లో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్ మల్చలం మురళీ ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకటమాధవరావుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పి మోసం చేస్తోందని మండిపడ్డారు. బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న 23 శాతం నుంచి 42 శాతానికి రిజర్వేషన్లను పెంచుతామని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి, తగిన నిధులను అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు అమడాపురం నర్సింహ్మ, ప్యాట అశోక్, శ్రీనివాసచారి, హరిభూషణ్, ఇస్నాతి శ్రీనివాస్, శ్యాం, కాసోజు శివకుమార్, బాల్‌రెడ్డి, విజయ్, తదితరులు ఉన్నారు.

బీసీలను ప్రభుత్వం మోసం చేస్తోంది

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ అన్నారు. హామీలను అమలు చేయాలని కోరుతూ నాయకులు తహసీల్దార్ అజీం అలీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సొప్పరి నర్సింహా, పల్లె అంజయ్య, మధుసూదన్‌గౌడ్, ఉదయ్‌కుమార్‌గౌడ్, కృష్ణయ్య, నర్సింహా, లింగయ్య, ఐలయ్య, జైపాల్‌రెడ్డి, భక్తవత్సల్, రమేశ్, అశోక్, వెంకటేశ్, మల్లారెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

శంకర్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌పై ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం శంకర్‌పల్లి బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ఓబీసీ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, వెంకటేశం, పండితరావు, శంకర్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

నందిగామ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా నేటివరకు బీసీ డిక్లరేషన్ అమలు చేయడం లేదని బీజేపీ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రమైన నందిగామలో సోమవారం బీజేపీ నాయకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఓబీసీ జిల్లా కార్యదర్శి అన్నారం రాజుగౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దారు రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు చెన్నయ్య, జంగయ్య, సుధాకర్, మోహన్‌సింగ్, రమేశ్, హేమంత్‌నాయక్, సత్యం, భాను ప్రసాద్, కరుణాకర్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

షాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి సభలో బీసీలకు రిజర్వేషన్లపై ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరు మాణెయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు బర్క శ్రీశైలం పేర్కొన్నారు. సోమవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణయ్యకు ఓబీసీ మండల కార్యదర్శి రాకేశ్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సురేశ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, నాయకులు మహేశ్, విజయ్, రవి, గోవర్ధన్, రాజు, ఉపేందర్, ప్రశాంత్, అరుణ్, వినయ్, రమేశ్, శేఖర్, రాజేశ్ ఉన్నారు.